# ఆధునిక నాటకాలలో మానవుని చిత్రణ

ప్రజలకు హితాన్ని బోధించేది సాహిత్యమన్నారు. అందువల్ల ప్రత్యక్షంగానో పరోక్షంగానో మానవుణ్ణి గురించి, సాంప్రదాయికమైన సాంఘిక మత వ్యవస్థలకూ మానవుడికి నిత్యం జరిగే సంఘర్షణను గురించి చర్చించని సాహిత్య ప్రక్రియ అంటూ ఉండదు. మిగిలిన ప్రక్రియలలోవలే కాక నాటకాలలో ఈ చర్చ అంతర్నిహితమై వ్యాఖ్యానాత్మకంగా ఉండడంవల్లా, దీనిని చిత్రించే నేర్పు పరిపక్వమైన శిల్పవిజ్ఞానానికి నిదర్శనంగా భావించడం వల్లా సాహిత్య ప్రక్రియలలో నాటకానికి ఉన్నతమైన స్థానాన్ని ఇచ్చారు ఆలంకారికులు. కనుకనే నాటకకర్త మానవుడి స్థితికి ప్రత్యక్ష వ్యాఖ్యానం చేసే తత్త్వవేత్తగా భావింపబడ్డారు.

ఇబ్సన్‌తో, వాస్తవికతావాదంతో ప్రారంభమైన ఆధునిక నాటకోద్యమం వివిధ గతుల్లో పయనించి, ఎన్నో కొత్త ప్రయోగాత్మక నాటక విధానాలను రూపొందించుకొంది. ఆంటోయన్ ఆధ్వర్యంలో ప్రారంభింపబడిన థియేటర్ లీబ్ర్ (Theatre Libre), స్టానిస్లవస్కీ ప్రారంభించిన మాస్కో ఆర్ట్ థియేటర్ (Moscow Art Theatre) వంటి స్థానిక నాటకరంగాలు సమకాలీన నాటకరంగాన్ని ఎంతో ప్రభావితం చేశాయి. ఇవికాక ప్రతీకవాదం (Symbolism), అభివ్యక్తివాదం (Erpressionism), అస్తిత్వవాదం (Existentialism), ఎపిక్ నాటకరంగం (Epic Theatre), అసంబద్ధ నాటకరంగం (Theatre of the Absurd) వంటి వెన్నో క్షణక్షణమూ మారుతున్న మానవుడి జీవనగతిని ప్రతిబింబించే ప్రయత్నం చేశాయి. ఇందులో కొన్ని మానవుడి స్థితిగతులను గురించి తాత్త్విక చింతన చేసిన ప్రయోగాలు. మరికొన్ని చెప్పేభావం కొత్తది కాకపోయినా వినూత్న శిల్పవిధానాలను, ప్రయోగపద్ధతులను ప్రయుక్తం చేసినవి. ఈ ఉద్యమాలన్నీ పాశ్చాత్య దేశాలలో - ముఖ్యంగా ఐరోపా, అమెరికా ఖండాలలో - ప్రచలిత మైనవి. సంఘ పరిణామం మెల్లగా జరగడం వల్ల కావచ్చు; లేదా ప్రయోగాత్మక నాటకాలకు సరియైన వాతావరణం లేక కావచ్చు - మన దేశంలో - ఈ నాటకోద్యమాలలో వచ్చిన మార్పులు, ప్రయోగాలు అంతగా ప్రచారంలోకి రాలేదు. కొద్ది ప్రయోగాత్మక నాటకాలను మినహాయిస్తే, మన నాటకాలు యింకా సాంఘిక దురన్యాయాలను, ఆర్థిక అసమానతలను ఎత్తిచూపే సమస్యా నాటకాల స్థాయిలోనే ఉన్నాయి. మారుతున్న కాలంలో, ఈ అణుయుగంలో, మానవుడి స్థితిగతులకు సంబంధించిన తాత్త్విక చింతన ఇంకా మన నాటకాలకు ఎక్కలేదనే చెప్పాలి. అందువల్ల '' ఆధునిక నాటకాలు'' అంటే ఈ శతాబ్దంలో పాశ్చాత్య నాటకరంగంలో వచ్చిన వివిధ నాటకోద్యమాలు మానవుడి చిత్రించిన విధానాన్ని గురించి మాత్రమే ఇక్కడ క్లుప్తంగా వివరిస్తాను.

పందొమ్మిదవ శతాబ్దం చివరిభాగంలో ప్రారంభమైన వాస్తవికతా వాదానికి, దానితోపాటు ఆధునిక నాటకోద్యమానికి మూలపురుషుడని చెప్పదగినవాడు ఇబ్సన్. యధార్థతకు దూరంగా, కేవలం భావనాత్మకములైన కథా వస్తువులతో, ఉద్వేగాలను యథేచ్ఛగా రంగస్థలం మీద కదను తొక్కించిన కాల్పనిక నాటకాలకు ప్రతిగా ప్రారంభమైన ఈ ఉద్యమం మానవుడి పరిసరాలను, అతని గత చరిత్రను, వంశానుగతంగా వస్తున్న లక్షణాలను మానవుడి చరిత్ర చిత్రణలకు ఆలంబనంగా స్వీకరించాయి. **Pillars of the Society**తో సాంఘిక సమస్యా నాటకాలకు ప్రాతిపదకను వేసిన ఇబ్సన్ **A Doll's House** లో స్త్రీ సమస్యలను, **Ghosts** లో మానవుడి మీద ఆనువంశికత చూపే ప్రభావాన్ని స్వీకరించి ఆనాటి మధ్యతరగతి జీవితంలో ప్రస్ఫుటమైన సమస్యలను నాటకీకరించాడు.

సాహిత్యంలో చిత్రించే మానవ జీవితం యదార్థ జీవితానికి అతి సన్నిహితంగా ఉండాలనే యథార్థవాదం **(Naturalism)** ఎమిలీ జోలా ప్రభావంతో ప్రారంభమైంది. మానవుడి వంశానుగతమైన లక్షణాలు అతడి వర్తమాన

జీవితాన్ని నియమిస్తాయన్నది ఇందులో ప్రధాన సూత్రం.

కాని అనతికాలంలోనే దీనికి ప్రతిగా ఎన్నో నాటకోద్యమాలు బయలుదేరాయి. వీనిలో ముఖ్యంగా పేర్కొనవలసినవి ప్రతీకవాదం, అభివ్యక్తివాదం.

ప్రతీక నాటకాల్లో మానవుడి బాహ్య పరిసరాల చిత్రణలో ప్రమేయంలేని అంతర ఉద్వేగాల సంఘర్షణ చిత్రింపబడ్డది. ఇందువల్ల మానవుడి బాహ్య జీవితాన్ని కాక, అంతర జీవిత సత్యాన్ని ఆవిష్కరించడానికి అవకాశం ఉన్నదని నమ్మిన నాటక కర్తలలో మారిస్ మాటర్ లింక్ ప్రఖ్యాతుడు. అభివ్యక్తివాదం ఈ శతాబ్దం మొదటిభాగంలో ఎంతో ప్రఖ్యాతి వహించిన నాటకోద్యమం. దీనికి మూలపురుషుడు ఆగస్ట్ స్ట్రిన్డ్‌బెర్గ్. ఆయన తాను వ్రాసిన ''ది డ్రీమ్ ప్లే'' **(The Dream Play)** అన్న నాటక పీఠికలో ఈ వాదం లక్షణాలను ఈవిధంగా పేర్కొన్నాడు: బాహ్యదృష్టికి పరస్పరం సంబంధం లేనట్లు కనుపించినా, హారంలో సూత్రం వలె అంతర్గతంగా సామంజస్యం అనిపించే స్వాప్నిక జగత్తును ఈ నాటకంలో అనుకరిస్తున్నాడు రచయిత. ఎటువంటి సంఘటన అయినా జరగవచ్చు; ప్రతిదీ సాధ్యమే, సంభవమే. కాలం, దూరం - వీటి ప్రసక్తి లేదు. భావనకు, ఊహకు ఇందులో ప్రాముఖ్యం ఈ నాటకం మానవుడి జ్ఞాపకాలు, ఊహలు, భావనలు - అసంబద్ధ భావములన్నిటి కలయిక''. ఈ పద్ధతికి చెందిన నాటకకర్తలు - ఎర్నెస్ట్‌టోలర్, కారల్ కాపెక్, జార్జ్‌కెయిజర్ ప్రభృతులందరూ సాంఘిక సత్యాన్ని చాటిచెప్పాలన్న ఆకాంక్ష కలవారే!

విజ్ఞానశాస్త్ర ప్రగతి, అణుయుగం మానవుణ్ణి ఏవిధంగా యాంత్రికంగా మార్చివేస్తున్నాయో, మానవుడు తన సహజ ప్రవృత్తికి అనుగుణంగా ఈ కాలంలో ఏవిధంగా జీవించలేక పోతున్నాడో చూపించే నాటకాలనే వ్రాశారు వీరందరూ. వాస్తవిక నాటక కర్తలు బాహ్యపరిసరాలను, మానవుడి జీవితం మీద అవి కనబరచే ప్రభావాన్ని చిత్రించగా, అభివ్యక్తి వాదాన్ని అనుసరించిన నాటకకర్తలు, ప్రతీక నాటకకర్తలు అట్టి బాహ్యప్రవృత్తుల చిత్రీకరణం మానవుడి అంతరాంతరాల సంఘర్షణను విస్పష్టంగా చిత్రించలేదని భావించి, వానిస్థానే సాంఘిక న్యాయాన్ని ప్రతిపాదించడానికి, దురన్యాయాలను విమర్శించడానికి మానవుడి మనస్సులో చెలరేగే ఉద్వేగాల సంఘర్షణను ప్రాతిపదికగా స్వీకరించారు. సంఘంలో ఎటువంటి మార్పు రావాలన్నా, అది ముందుగా మానవుడి మనస్సులోనే రావలసి ఉంటుందని వీరి నిశ్చయం.

ఈ రెండు ఉద్యమాలకు మధ్యేమార్గంగా నిలిచే నాటకోద్యమం **(Theatre of Social Action)** సాంఘిక ప్రతిఘటనోద్యమం అనవచ్చు. దీనిని మానవుడి ప్రవర్తన అంతా అతడి జీవితాన్ని నిర్ధరించే ఆర్థిక, రాజకీయ శక్తుల మీద ఆధారపడి ఉంటుంది, అన్నది ఈ ఉద్యమానికి మూలసూత్రం. ఇది రష్యా దేశంలో ఎంతో ప్రచారంలోకి వచ్చింది. ఈనాడు మనదేశంలో వ్రాయబడుతున్న నాటకాలలో నూటికి తొంభై వంతులు ఇటువంటివేనని చెప్పవచ్చు. ఈ ఉద్యమానికి బెర్టోల్ట్ బ్రెఖ్ట్ ప్రారంభించిన కావ్యనాటకరంగం **(Epic theatre)** నవచైతన్యాన్ని ఇచ్చింది. పూర్వపు నాటకాలలో నాటకీయత ఎక్కువగా ఉండడం వల్ల, జీవిత యాదార్థ్యాన్ని సరియైన దృక్పథంలో చూడటం కష్టసాధ్యం కనుక ఆ నాటకీయమైన, కావ్యాత్మకమైన ఎపిక్ శిల్పాన్ని అనుసరించాడు బ్రెఖ్ట్. సాంఘిక పరిణామాన్ని, వర్తమానకాలం యెడ మానవుని దృష్టిలో మార్పును తీసుకొని రావడానికి గతకాలపు కథలను ప్రజలు చూడాలని, ఆనాటి సంఘటనలు పునఃప్రదర్శించి అందులో వారు పాల్గొనాలని అప్పుడే వారికి ఆనాటి జీవితానికి నేటి జీవితానికీ గల తారతమ్యాలు తెలిసి, ఈనాటి జీవన విధానంలో [illegible]న మార్పులు అవగాహన అవుతాయని బ్రెఖ్ట్ వాదం. దీనిని **"historification"** అన్నాడాయన.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత వచ్చిన వివిధ నాటకోద్యమాలలో మనస్తత్వచిత్రణతో కూడిన వాస్తవికతావాదం (historical realism) అమెరికాలో ఎక్కువగా ప్రచారంలోకి వచ్చింది. టెన్నెసీ విలియమ్స్, ఆర్థర్ మిల్లర్ ఇట్టి నాటకాలు వ్రాసిన ప్రఖ్యాతులు.

ఆధునిక నాటకరంగంలో మరి రెండు ప్రఖ్యాతమైన నాటకోద్యమాలు ఉన్నాయి: ఇవి అస్తిత్వవాదం (existentialism), అసంబద్ధ నాటకరంగం (Theatre of the Absuard). ఈ రెండూ వర్తమాన మానవుడి స్థితిగతులను తాత్త్వికదృక్పథంతో చూడడానికి, చిత్రించడానికి ప్రయత్నించేవే! అస్తిత్వవాదులలో సార్త్ర్ (Sartre), కామూ (Camus) లు ముఖ్యులు. వీరి రచనలకు నిరాశావాదం మూలకందకమైన సూత్రం. ఆత్మపరిపూర్ణతకోసం మానవుడు సాగిస్తున్న అన్వేషణకీ, అపరిపూర్ణమైన బాహ్యప్రపంచానికీ మధ్య విస్పష్టమైన వ్యతిరేకత ఉన్నది. జర్మన్ వేదాంతులు చెప్పినట్లు మనిషికీ అతనిచుట్టూ ఉన్న పరిసరాలకు సామరస్యం అంటూలేదని ఈ రచయితలు నమ్మారు. ఈ సంఘర్షణే మానవుడికి ఇచ్ఛా స్వాతంత్ర్యాన్ని (Freedom of will) ఇచ్చిందనీ, మానవుడు తన విధికి తానే కర్త అనీ వీరి వాదం. అర్థరహితమైన ఈ జగత్తులోకి మానవుడు తన ప్రమేయం ఏమీ లేకుండానే తోసివేయబడ్డాడని, సందిగ్ధమైన పరిస్థితులలో మానవుడు తన భవితవ్యాన్ని తానే నిర్ణయించుకోవాలని ఈ రచయితలు వాదించారు. అయితే ఈనిర్ణయం చివరకు మానవుడికి బాధను, విషాదాన్ని మాత్రమే కలిగిస్తుందని మానవుడి ఏకాకి జీవితంలో గత్యంతరం మృత్యువేనని, మానవుడు దానికోసం వేచివుండడం కన్న మరేమీ చేయలేడని వీరి వాదం.

అసంబద్ధ నాటకరంగం వినూత్నమైన నాటకోద్యమాన్ని రూపొందించింది . మానవుడి నికృష్టస్థితి, ఆశారహితమైన అతని జీవనగతి, గమ్యంలేని వైపుకు సాగుతున్న అతని జీవితయాత్ర - వీటిని గురించి ప్రత్యేకంగా ఆలోచించారు ఈ రచయితలు. మానవుడి అసంబద్ధస్థితికి దేవుడు లేడన్న నమ్మకం ప్రబలడమే ముఖ్యమైన కారణం. ''విజ్ఞానశాస్త్రం, తర్కం ఇవి అన్నీ అర్థం లేనివి. దేవుడులేని జగత్తులో మానవుడు అవ్యవస్థితమైన ఒంటరి జీవితాన్ని గడుపుతున్నాడు. తన పరిసరాలతో సామరస్యం లేని ఏకాకి జీవితం గడుపుతున్నాడు'' అంటారు అసంబద్ధ నాటక రచయితలు. 1970వ సంవత్సరం నోబెల్ బహుమానం గ్రహించిన శామ్యూల్ బెకెట్, అయనెస్కో, అదమావ్, ఎడ్వర్డ్ అల్బీ, హెరాల్డ్ పింటర్, జీనే ప్రభృతులు ఈ పద్ధతికి చెందిన నాటకకర్తలు.

బెకెట్ వ్రాసిన ప్రఖ్యాత నాటకం ''గోడో కోసం నిరీక్షణ'' (Waiting for Godot) అన్న నాటకంలో ఇద్దరు బికారులైన వ్యక్తులు ఎవరికోసమో నిరంతరం నిరీక్షించడం చిత్రీకరించబడ్డది. ఈగోడో భగవంతుడికి ప్రతీక అని కొందరి మతం. ఏమైనా మానవుడి జీవితం అర్థరహితమైన నిరీక్షణ అయిపోయిందని, అసంగతము, అర్థరహితమైన ఈ ప్రపంచంలోకి బలవంతాన త్రోసివేయబడ్డ మనిషి అర్థంలేని నిరీక్షణ చేయడం కన్న అర్థవంతమైన పని మరొకటి చేయలేడని ఈ నాటకకర్తల మతం.

ఈనాటి నాటకరంగం త్వరితగతిని మారుతూ కొత్త సిద్ధాంతాలను, కొత్త నాటక విధానాలను రూపొందించుకొంటున్నది. కాని ఈ విభిన్న విధానాలు జీవితం అంటే ఏమిటి? మానవుడి జీవితానికి అర్థం ఏమిటి? అన్న ప్రాథమికము, ప్రధానమూ అయిన ప్రశ్నలకు వేరు వేరు నాటకకర్తలు ఇచ్చే విభిన్నమైన సమాధానాలని మనం గ్రహిస్తే, ఈ నాటకోద్యమాలన్నీ మానవ జీవితాన్ని గురించి ఏదో ఒక పద్ధతిలో తాత్త్వికచింతన చేసిన వివిధ ప్రయోగాలని మనకు కన్పట్టక మానవు.

- (ఆకాశవాణి సౌజన్యంతో)